# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

-  ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటం టెక్నాలజీ కీలకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

-  మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు పార్లమెంట్లో ప్రవేశపెడుతున్న 'నారీ శక్తి వందన్ అధినియం' చట్ట సవరణ బిల్లుకు మద్దతు పలకాలని అన్ని రాజకీయ పార్టీలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

-  గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

-  డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు ఘనంగా జరిగాయి.

-  కోస్తాంధ్రలో రాగల 5 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు మేర పెరిగే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

====================

డిజిటల్ యుగానికి ఇంటర్నెట్ మాదిరిగా ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటం టెక్నాలజీ కీలకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. క్వాంటం సాంకేతికతలో సాధికారిత సాధించిన దేశాలే భవిష్యత్తులో అవకాశాలను ముందుగా అందిపుచ్చుకుంటాయని చెప్పారు. దేశంలోనే తొలి క్వాంటం ఫెసిలిటీ సెంటర్‌ను ఆయన ఈరోజు అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఆవిష్కరించారు. వర్సిటీలోని అమరావతి 1ఎస్, గన్నవరం మేధాటవర్స్‌లో ఏర్పాటు చేసిన 1క్యూ క్వాంటం టెస్ట్‌బెడ్స్‌ను ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ... భారతీయ పరిశోధకులకు క్వాంటం హార్డ్‌వేర్ పరీక్షించేందుకు అమరావతి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ (AQRF) కీలకంగా మారుతుందన్నారు. అమరావతి 1S టెస్ట్ బెడ్ పరిశోధనలకు, మేధా టవర్స్‌లోని 1Q టెస్ట్ బెడ్ పారిశ్రామిక వినియోగానికి తోడ్పడతాయని తెలిపారు. ఈ రెండూ క్వాంటం టెక్నాలజీలో దేశ సామర్ధ్యాన్ని పెంచాయన్నారు. దేశంలోని తొలి క్వాంటం కంప్యూటర్లకు ఆంధ్రప్రదేశ్ వేదిక అయినందుకు సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

(వాయిస్...27 సెకన్లు)

====================

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియం' చట్ట సవరణ బిల్లుకు మద్దతు పలకాలని కోరుతూ రాజకీయ పార్టీల అధ్యక్షులకు, రాష్ట్రంలోని రాజ్యసభ, లోక్ సభ ఎంపీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. 2029 ఎన్నికల నుంచే మహిళలకు ఈ రిజర్వేషన్ అమలు చేసేలా తీసుకువస్తున్న ఈ బిల్లుకు మద్దతు పలకాలని ఆ లేఖలో కోరారు. జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లకు ముఖ్యమంత్రి ఈరోజు లేఖలు రాశారు. 'నారీ శక్తి వందన్ అధినియం' మహిళా సాధికారతతో పాటు దేశ ఉన్నతికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

మహిళలకు పార్లమెంట్, విధాన సభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంకల్పాన్ని బలపరుద్దామని, భరతమాతను పూజించే దేశంగా నారీ శక్తికి వందనం పలుకుదామని ముఖ్యమంత్రి ఆ లేఖలో పిలుపునిచ్చారు.

====================

కుంభమేళా తరహాలో 2027 గోదావరి పుష్కరాలను నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఆదేశించినట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఈరోజు తాను పవన్ కళ్యాణ్ ను కలిశానని ఈ సందర్భంగా ఆయన గోదావరి పుష్కరాల నిర్వహణపై పలు సూచనలు చేసినట్లు మంత్రి దుర్గేష్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జూన్ 26 నుండి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో వైభవంగా నిర్వహించాలని సూచించినట్లు మంత్రి దుర్గేష్ చెప్పారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా ఉత్సవానికి సుమారు 10 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేశామని, భక్తుల సౌకర్యాలకు, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని భావించినట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరంతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఘాట్ల ఆధునీకరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని మంత్రి దుర్గేష్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

====================

శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మూలాల అన్వేషణకు నిపుణుల నియామకాలు, మౌలిక సదుపాయాల కల్పన పూర్తయ్యింది. విశాఖపట్టణంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలతో ప్రత్యేకంగా ల్యాబ్ ను ఏర్పాటు చేశారు. కిడ్నీ వ్యాధుల నిర్ధారణకు ఉద్దాన ప్రాంత వాసుల నుండి రక్త నమూనాలను సేకరిస్తున్నారు. కిడ్నీ వ్యాధుల బారినపడే అవకాశం ఉన్న వారిని ముందుగానే గుర్తించేలా మూత్ర నమూనాల పరీక్షలో 'బయో మార్కర్స్' విధానాన్ని ఈ సారి కొత్తగా అమలు చేస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళి ద్వారా స్థానికుల నుంచి సమాధానాలు రాబడుతున్నారు. ఇప్పటివరకు ఉద్దాన ప్రాంతంలో తీసుకున్న చర్యల పురోగతి గురించి పరిశోధన బృందం రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ కు నివేదించింది. ఈ సందర్భంగా పరిశోధన చురుగ్గా నిర్వహించాలని, ఉద్దాన బాధితుల్లో సాంత్వన చేకూరేలా చర్యలుండాలని బృందం సభ్యులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

====================

విరామం

====================

భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు ఘనంగా నిర్వహించారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు అంబేద్కర్ జయంతి వేడుకలకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన భారతదేశానికి దిక్సూచి వంటి భారత రాజ్యాంగాన్ని రచించిన గొప్ప మేధావి అంబేద్కర్ అని పలువురు కొనియాడారు. ప్రజలందరూ స్వేచ్ఛగా జీవించేందుకు డా.బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కుల కల్పించారని గుర్తు చేశారు. అంబేద్కర్ ఆశయాలు సమాజానికి మార్గదర్శకమని, యువత అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు.

====================

భారతదేశం ఇంధన స్వావలంభన సాధించాలంటే ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడితే వచ్చే ఇబ్బందులను స్పష్టంగా చూస్తున్నామని, ఈ నేపథ్యంలో సౌరశక్తి వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నగరంలోని హెలెన్ కెల్లర్ విజువల్లీ ఛాలెంజ్డ్ స్కూల్లో 5 కిలోవాట్ సామర్థ్యం గల సౌర విద్యుత్ వ్యవస్థను ఆయన ఈరోజు ప్రారంభించారు. దీని ద్వారా ప్రతి నెలా సుమారు 600 యూనిట్ల విద్యుత్ ఉచితంగా లభించడంతో పాటు విద్యుత్ ఖర్చులు గణనీయంగా తగ్గనున్నాయని విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా ప్రజలు ఎలక్ట్రిక్ పరికరాలపై వంట చేసేందుకు మొగ్గుచూపుతున్నారని అన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే రాయితీతో పాటు దీర్ఘకాలిక ఆర్థిక లాభాలు పొందవచ్చని ఆయన తెలియజేశారు.

====================

ఆంధ్రప్రదేశ్ లోని దిగువ ట్రోపో ఆవరణం మీదుగా దక్షిణం, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా కోస్తాంధ్రలో రాగల 7 రోజుల్లో వేడి, తేమతో కూడిన అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. కోస్తాంధ్రలో రాగల 5 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు క్రమంగా పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎం.వెంకట్రావు వెల్లడిస్తూ...

(వాయిస్...25 సెకన్లు)

=====================

ఆంధ్రప్రదేశ్ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల బృందం నేపాల్ ఎవరెస్ట్ శిఖర అధిరోహణ యాత్ర చేపట్టనుంది. 21 మంది విద్యార్థుల బృందం రేపటి నుంచి 30వ తేదీ వరకు 16 రోజుల పాటు ఈ సాహసయాత్ర చేయనుంది. 5,364 మీటర్ల ఎత్తులోని ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ను ప్రభుత్వ విద్యాసంస్థల్లోని 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు అధిరోహించనున్నారు. రేపు మధ్యాహ్నం ఈ విద్యార్థుల బృందం నేపాల్ రాజధాని ఖాట్మండూకు చేరుకోనుంది. అక్కడి నుంచి ఎవరెస్ట్ పర్వతారోహణ సాహసయాత్ర ప్రారంభం కానుంది. అయితే ఈ విద్యార్థుల బృందం రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను ఈరోజు ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసింది. నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్రకు సిద్ధమవుతున్న విద్యార్థుల బృందాన్ని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. మనలో ఉండే పట్టుదలే మనల్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని చెబుతూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. సవాళ్లను అధిగమించి ప్రపంచాన్ని జయించాలన్నారు. యాత్ర విజయవంతంగా పూర్తి చేయాలని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

=====================

=====================